క్లుప్తంగా

దేవరపల్లి భజన మండలికి టీటీడీ ఆహ్వానం



దేవరపల్లి భజన మండలి సభ్యులు

పామిడి: తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి భజన మండపంలో భగవన్నామ సంకీర్తనలు ఆలపించేందుకు మండలంలోని దేవరపల్లి భజన మండలికి అవకాశం లభించింది. ఈ మేరకు భజన మండలి సభ్యులు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని దైవ సంకీర్తనాలాపన చేయాలని ఆ దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ అధికారులు వారిని ఆహ్వానించారు. అరుదైన ఆహ్వానం తమకు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని భజన మండలి సభ్యుడు కడంటి హరి అన్నారు. ఇదే రోజు వారు తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

భారత్‌పై ట్రంప్ 'సుంకాల యుద్ధం'



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: ఎగుమతులపై అధిక సుంకాలు వేస్తూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుట్రలు పన్నుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భజంత్రీ శ్రీనివాసులు విమర్శించారు. సీపీఎం ముద్రించిన భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం పుస్తకాన్ని ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఈ బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, సీపీఎం నాయకులు జ్యోతి, జయమ్మ, చంద్రశేఖర్, షబ్బీర్ రాము, షాషా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరి దంపతులకు గాయాలు



గాయపడ్డ రంగనాయకులు, అశ్వని

తాడిపత్రి రూరల్: మండలంలోని పులిప్రొద్దుటూరు వద్ద ఆదివారం ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో తాడిపత్రికి చెందిన హెచ్‌ఎం టీవీ విలేకరి రంగనాయకులు, అతడి భార్య అశ్వనికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన వారు ద్విచక్రవాహనంలో యుగుడూరు గంగమ్మకు వెళుతుండగా ఎదురుగా ట్రాక్టర్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. వీరిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో ఉద్యోగ ఉపాధ్యాయ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురానికి చెందిన కిరణ్‌కుమార్‌కు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. కిరణ్‌కుమార్ కుమారుడు చిన్నిక్రిష్ణ కొంత కాలంగా కాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం సంస్థను సంప్రదించడంతో ఆర్థిక సాయం అందజేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామాంజనేయులు, వ్యవస్థాపకుడు నారబోయిన శంకర్, ప్రధాన కార్యదర్శ రామేశ్వరెడ్డి, గౌరవ అధ్యక్షుడు గురప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఎద్దును చూపుతున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని యర్రగుంటపల్లిలో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతి చెందింది. వివరాలు గ్రామానికి చెందిన రైతు బాలక్రిష్ణకు చెందిన ఎద్దు నీటి సంపు వద్ద పచ్చిగడ్డి మేస్తూ అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి చనిపోయింది. తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటం వల్లే ఎద్దు మృతి చెందిందని, దాదాపు రూ.80 వేలు నష్టపోయానని బాధితుడు ఆరోపించాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

వసూళ్ల పండగ

- టపాసుల విక్రయ అనుమతుల్లో అధికారుల చేతివాటం
- ఒక్కో దుకాణానికి రూ.10 వేలకు పైగా వసూలు



తాడిపత్రిలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ కేంద్రం

తాడిపత్రి రూరల్: దీపావళి వస్తే ఆయా శాఖల అధికారులకు మామూళ్ల పండగే. వివిధ రకాల అనుమతుల పేరుతో ముక్కు పిండి అమ్యామ్యాలు వసూలు చేస్తున్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో టపాసుల విక్రయ కేంద్రాలకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్యులు జారీ చేసింది. గతంలో తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతంలో టపాసుల విక్రయానికి 10 మంది లైసెన్సు దారులు ఉండగా ప్రస్తుతం 19కి చేరింది. వీరిలో కొందరు పెన్నానది ఒడ్డున, యల్లనూరు రోడ్డులోని పప్పుల బట్టీ వద్ద స్టాల్స్ పెట్టి విక్రయించనున్నారు. టపాసుల విక్రయాల్లో 50 శాతంకు పైగా మార్జిన్ ఉండటంతో ఎక్కువ మంది తాత్కాలిక లైసెన్సులకు అనుమతులు తీసుకున్నారు. అధికారులకు మామూళ్లు ముట్టజెప్పితే నిబంధనలు పాటించకున్నా, ఎక్కువ ధరలకు విక్రయాలు జరిపినా పట్టించుకోరన్న ఆలోచనతో వారు అడిగి మొత్తాలను చెల్లించి అనుమతులు తీసుకుంటున్నారు. ముడుపులతో పాటు పండగ సమయంలో గిఫ్టు ప్యాక్‌ల పేరుతో టపాసులను ఉచితంగా ఇవ్వడానికి ఒప్పందం కూడా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

టపాసులు విక్రయించాలంటే..

టపాసుల విక్రయాల దుకాణాల కోసం మొదట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలి. అంతేకాకుండా విద్యుత్, శానిటేషన్, పంచాయతీ, మునిసిపాలిటీ, అగ్నిమాపక శాఖల నుంచి ఎన్‌ఓసీ(నో అబ్జెక్షన్) సర్టిఫికెట్ తీసుకోవాలి. నిబంధనలు పాటించకపోతే లైసెన్సులను రద్దు చేసి టపాసులను సీజ్ చేసే అధికారం అధికారులకు ఉంది. బందోబస్తు ఇతర కారణాల పేరుతో పోలీసు శాఖలోని కొందరు టపాసు విక్రయదారుల నుంచి ముడుపులతో పాటు గిఫ్ట్ ప్యాకెట్లను కూడా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇళ్ల మధ్యలో టపాసుల నిల్వలు

టపాసులను ఇళ్ల మధ్యలో నిల్వ చేసుకుంటున్నా ముడుపుల కారణంగా ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో పుట్లూరు రోడ్డు సర్కిల్‌లో ఇంటిలో టపాసుల నిల్వలు పేలి ముగ్గురు ప్రాణాలను కోల్పోయారు. గాంధీకట్ట వద్ద ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు నిబంధనలు పాటించకపోవడంతో అగ్నికి ఆహుతయ్యాయి. తాడిపత్రి ప్రాంతంలో ఎక్కువగా తమిళనాడులోని శివకాశి నుంచి టపాసులను దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ ఎంత సరుకు వచ్చింది? ఎక్కడ నిల్వ చేశారు? అన్న దానిపై అధికారులు పట్టించుకోపవడం లేదు. నిబంధనలు కాలరాస్తున్న వ్యాపారులపై అధికారులు మామూళ్ల మత్తులో దాడులు చేయడం లేదని తెలుస్తోంది.

జీఎస్టీ ఎగవేత

టపాసుల విక్రయాలపై జీఎస్టీ 18 శాతం ఉంది. గత ఏడాది జరిగిన విక్రయాల్లో ఎంత జీఎస్టీ చెల్లించారో సమాచారం ఇవ్వడానికి వాణిజ్య పన్నులశాఖ అధికారులు కుంటిసాకులతో దాటవేస్తున్నారు. ఈ శాఖలోని కొందరికి ముడుపులు అందుతుండటం వల్ల వ్యాపారులకు సహకరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పెద్ద మొత్తంలో జీఎస్టీ ఎగవేసేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. వ్యాపారులందరూ సిండికేట్‌గా మారి అధిక ధరలకు టపాసులను పెంచి ప్రజలను నిలువు దోపిడీ చేయడానికి రంగం సిద్ధం చేశారు.

నిబంధనలు పాటించాలి



నిబంధలకు విరుద్ధంగా టపాసుల విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. భద్రతా లోపాలు కనిపిస్తే టపాసుల విక్రయ కేంద్రాలను మూసివేసి సరుకును సీజ్ చేస్తాం. దుకాణదారుల నుంచి ఎవరైనా వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. పట్టణ సమీపంలోని పెన్నానది ఒడ్డున, యల్లనూరు రోడ్డులో ఏర్పాటు చేస్తున్న టపాసుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశాం. – శివగంగాధర్‌రెడ్డి, అప్‌గ్రేడ్ సీఐ

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

శింగనమల(నార్పల): రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు చంద్రబాబు కుట్రలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ఖాదర్‌వలి అధ్యక్షతన నార్పల మండలంలోని దుర్గం, సిద్ధరాచెర్ల, గొల్లపల్లి, బండ్లపల్లి, తుంపెర గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శైలజానాథ్‌తో పాటు నియోజకవర్గ పరిశీలకుడు ఎల్.ఎం.మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలు పేద విద్యార్థులకు వరమన్నారు. వాటిని ప్రైవేటుకు అప్పగిస్తే ఆరోగ్యం ధనికులకే పరిమితమవుతుందన్నారు. ప్రజల, పేద విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఈ దుర్మార్గ నిర్ణయాన్ని ప్రజలు సహించబోరన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కక్షసాధింపు పాలన సాగిస్తోందన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు, కేసులు పెడుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు కుట్రలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో పరిపాలన అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరారావు, నాయకులు తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజగోపాల్, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, బీకేఎస్ జెడ్పీటీసీ భాస్కర్, పద్మావతి, పట్నం ఫణీంద్ర, సాకే రామాంజనేయులు, ఎంపీటీసీ శంకర, సర్పంచ్ రామాంజనేయులు, రమేష్ రెడ్డి, అంజి, సర్పంచ్ కుళ్లాయిరెడ్డి, పక్కీర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

'కోటి సంతకాల సేకరణ' జయప్రదం చేయండి

పామిడి: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక బొడ్రాయి ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గుంతకల్లు నియోజక వర్గానికి సంబంధించి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్ రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, మేధావులు, వైఎస్ అభిమానులు, ప్రజలు పెద్దెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వైవీఆర్ మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో పేద విద్యార్థులకు సైతం మెడిసిన్ విద్య అందాలన్న సంకల్పంతో కోట్లాది రూపాయలు వెచ్చించి మెడికల్ కళాశాలను నిర్మించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణకు పాల్పడడంతో పేదలకు మెడిసిన్ విద్య అందని ద్రాక్షల మారుతుందన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని సంఘీభావం తెలపాలని ఆయన కోరారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: పుట్టగొడుగుల పెంపకం లాభదాయమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో పుట్ట గొడుగులకు డిమాండ్ ఉందన్నారు. నిరుద్యోగ యువత పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పొంది కుటీర పరిశ్రమలాగ అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి పుట్ట గొడుగుల పెంపకంలో మెలకువలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

జీవన ఎరువుల వాడకం ఎంతో మేలు

రసాయన మందులకంటే జీవన ఎరువులు వాడకం ఎంతో మేలు అని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో జీవన ఎరువుల వారోత్సవాల సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ, ఎరువుల లభ్యత, పథకాలపై కేవీకే విస్తరణా శాస్త్రవేత్త చందన అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగుపై వాటిలో రాయితీలపై శాస్త్రవేత్త డాక్టర్ మాధవి వివరించారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్ కోసం ఒక్క సంతకం

పుట్లూరు: మా పిల్లల భవిష్యత్ కోసం మాజీ సీఎం వైఎస్ జగన్ మెడికల్ కళాశాలలను నిర్మిస్తే వాటిని ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నించడంపై గ్రామాల్లోని ప్రజలు మండిపడుతున్నారు. శింగనమల నియోజవర్గంలోని పుట్లూరు మండలంలో సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ పిలుపు మేరకు మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడుగుపల్లి, మడ్డిపల్లి, కడవకల్లు, సూరేపల్లి తదితర గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. పేద ప్రజల పిల్లలు పెద్ద చదువులు చదవకుండా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు.



పుట్లూరు మండలం ఎల్లుట్ల ఎస్సీ కాలనీలో సంతకాలు చేసి చూపుతున్న కాలనీ వాసులు

కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణాయాదవ్, విష్ణునారాయణ, ఎంపీటీసీ లక్ష్మిదేవి, ఆయా గ్రామాల నాయకులు బాలరాజు, శేఖర్, పెద్దిరాజు (పెద్దోడు) సత్యమయ్య, పవన్, కాటమయ్య, నరసింహుడు, గంగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

యాడికి: బాణసంచా కాల్చేటప్పుడు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి సూచించారు. ఆదవారం ఆయన యాడికిలోని టపాసుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, గడ్డి వాములు, పూరి గుడిసెలు అధికంగా ఉంటాయని అలాంటి ప్రాంతాల్లో చిచ్చు బుడ్లు తారాజువ్వలు వంటివి కాల్చకూడదన్నారు. పిల్లలు టపాకాయలు కాల్చేటప్పుడు పెద్దలు ఓ కన్ను వేసి ఉంచాలన్నారు. టపాసుల విక్రేతలు తమ దుకాణాల వద్ద విధిగా ఇసుక, నీరు, కార్బన్‌డైయాక్సైడ్ వాయువును అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దుకాణాల మధ్య కనీసం 10 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి దుకాణం ఎదుట టపాకాయల ధరల పట్టిక, అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు తప్పకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఈరన్న, పోలీసులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల వద్ద నిబంధనలు పాటించండి

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ హైస్కూల్లో లైసెన్స్ దారులు ఏర్పాటు చేసిన టపాసు కేంద్రాలను ఆదివారం సీఐ రామారావు పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని టపాసు విక్రయదారులకు సూచించారు. నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు అధిక ధరలను టపాసులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



టపాసుల వ్యాపారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

జాగ్రత్తలు తీసుకోండి

గార్లదిన్నె: దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సూచించారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో గార్లదిన్నె, కల్లూరులో 5 టపాకాయలు దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే టపాకాయలు విక్రయించాలన్నారు. టపాకాయలు కాల్చేటప్పుడు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న గాయాలయ్యే ప్రమాదం ఉందన్నారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థుల సీడాక్ సందర్శన

బుక్కరాయసముద్రం: మండలంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు బెంగళూరులోని సీ–డాక్ పరిశ్రమ సందర్శించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ, తృతీయ విభాగం విద్యార్థులు బెంగళూరులోని ప్రతిష్టాత్మక సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్ (సీడీఏసీ)ను సందర్శించారన్నారు. విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు, సూపర్ కంప్యూటర్‌ల పనితీరు భారత దేశంలోని ఆధునిక కంప్యూటింగ్ పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల గురించి సమగ్రంగా అవగాహన చేసుకున్నారన్నారు. సీ–డాక్ నిపుణులు విద్యార్థులకు ప్రత్యక్ష ప్రదర్శనలు చూపించడంతో పాటు దేశ వ్యాప్తంగా జరుగుతున్న ముఖ్యమైన సాంకేతిక ప్రాజెక్టులపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బెంగళూరు సీ–డాక్ ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.



బెంగళూరులో సీడీఏసీ వద్ద విద్యార్థులు

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద ముళ్ల పొదల్లో పేకాట పేకాట స్థావరరంపై దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.18,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

శింగనమల: మండలంలోని చక్రాయిపేట వద్ద బైక్‌ను ఇన్నోవా కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి 7 గంటలకు జరిగింది. సీ.బండమీదపల్లికి చెందిన పుల్లయ్య చక్రాయిపేటకు బైక్‌లో వెళ్లి తిరిగి గ్రామానికి బయలుదేరాడు. అదే సమయంలో అనంతపురం నుంచి తాడిపత్రికి వెళ్తున్న ఇన్నోవా కారు ఢీకొంది. గాయపడిన పుల్లయ్యను 108లో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చితంబరయ్య తెలిపారు.

ఇంట్లో చోరీ

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో నగరూరు రహదారిలో తాళం వేసిన ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారు జామున చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అమిలినేని లక్ష్మీనారాయణ నగరూరు రహదారిలో నివసిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలసి ఆయన విహార యాత్రలకు వెళ్లారు. గమనించిన దొంగలు ఆదివారం తెల్లవారుజామున ఆ ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. తెల్లవారిన తర్వాత చూసిన సమీప గృహాల ప్రజల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు రాయలచెరువుకు వెళ్లి చోరీ జరిగిన ఘటనపై ఆరా తీశారు. కాగా బాధితులు ఎవ్వరూ లేకపోవడంతో.. వారు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షురాలిగా చంద్రగిరి గొల్ల రాధ



గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ పల్లికి చెందిన చంద్రగిరి గొల్ల రాధ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఎంపికయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద పదవిని ఇచ్చిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి రుణ పడి ఉంటానన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. ఆమె ఎంపిక కావడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

విద్యార్థి మృతి

బుక్కరాయసముద్రం: చికిత్స పొందుతూ ఓ విద్యార్థి మృతిచెందాడు. వివరాలు.. మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీలో బీటెక్ సీఎస్ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న భరత్‌కుమార్‌రెడ్డి (21) చెరువు కట్టపై సాయిబాబా గుడి సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. బెంగుళూరులో చికిత్స పొందుతున్న భరత్‌కుమార్‌రెడ్డి ఆదివారం మృతి చెందినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. తల్లిదండ్రులు అనంత గిరిరెడ్డి, లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు.

దీపావళి శుభాకాంక్షలు



కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, శైలజానాథ్

తాడిపత్రిటౌన్/గుంతకల్లు టౌన్/శింగనమల: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, సాకే శైలజానాథ్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. చీకటిని తరిమికొట్టి వెలుగులను నింపే ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని వారు ఆకాంక్షించారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన రైతు పాపిరెడ్డికి ఆదివారం పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రైతు పాపిరెడ్డి పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండగా కాలికి పాము కాటు వేసింది. విషయం కుటుంబసభ్యులకు తెలపడంతో వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ-కేవైసీ 71 శాతం పూర్తి

యల్లనూరు: మండలంలో 18 వేల మంది ఉపాధి కూలీలుండగా 13 వేల మందికి ఈ-కేవైసీ (71 శాతం) పూర్తి చేశామని ఏపీఓ ఓబిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారంతో ఈ–కేవైసీ నమోదు గడువు పూర్తవుతుందన్నారు.

నేడు ఇరుసు ఎత్తే పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఉన్న తరిమెల రోడ్డులో సోమవారం యువకులకు ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహించనున్నారు.ఆదివారం గ్రామస్తులు మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా గ్రామీణ క్రీడల్లో భాగంగా యువకులకు ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

మహిళ మృతి

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఖుర్షిదా అనే మహిళ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు మండలంలోని ఎస్.తిమ్మాపురానికి చెందిన నబిరసూల్, ఖుర్షిదా దంపతులు బంధువుల ఇంట్లో జరిగే బంధువుల శుభకార్యానికి బసినేపల్లికి వచ్చారు. అనంతరం స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో ఈ నెల 15న వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఖుర్షిదా తీవ్రంగా గాయపడగా గుత్తి ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆమె మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆరో రోజుకు చేరిన దీక్షలు



దీక్షలో కూర్చొన్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు

గుంతకల్లు: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక దీక్షలు శనివారం నాటికి ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్‌నాయక్, శ్యాంసుందర్, శంకరప్ప, ముస్తఫా, మల్లీ, వీరేష్, ఆశీఫ్, ఆరీఫ్, అమీర్, కార్తీక్ తదితరులు దీక్షలో కూర్చొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, మహేష్, గోపీనాథ్, గౌస్, దేవేంద్ర, ఈశ్వరయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాకారోత్సవం



స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని మూలమూర్తుల ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తులైన పార్వతీ, బుగ్గ రామలింగేశ్వరస్వామి వార్లను వివిధ రకాల పూలమాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రాకారోత్సవంలో భాగంగా ఊరేగించారు. భక్తులు హాజరై ఉత్సవాన్ని తిలకించారు.